www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 28 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృథ్విరాజు | సంపుటి - 07, సంచిక-160 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# రెండ్రోజుల పాటు మోడీ గుజరాత్ పర్యటన

29,30 తేదీల్లో పలు కార్యక్రమాలకు శ్రీకారం ■ ఖరారు చేసిన పర్యటనపై అధికారిక ప్రకటన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ పర్యటన ఖరారు అయ్యింది. ప్రధాని నరేంద్ర మోదీ 29-30 తేదీల్లో రెండు రోజులపాటు గుజరాత్‌లో పర్యటించనున్నారు. సూరత్, భావ్‌నగర్‌లలో ప్రధాని మోడీ రోడ్ షో కూడా ఉంటుంది. సూరత్, భావ్‌నగర్, అహ్మదాబాద్, అంబాజీలలో జరిగే వివిధ కార్యక్రమాలకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టనున్నారు. ఈ రెండు రోజుల పర్యటనల్లో సుమారు రూ. 29,000 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన ప్రారంభించనున్నారు. ఇందులో ప్రపంచ స్థాయి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. తన రెండు రోజుల్లో ముందుగా అహ్మదాబాద్ మెట్రో ప్రాజెక్ట్ మొదటి దశను ప్రారంభిస్తారు ప్రధాని నరేంద్ర మోడీ. అనంతరం గాంధీనగర్-ముంబై సెంట్రల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఎ÷-లాగ్ ఆఫ్ చేస్తారు. దీని తర్వాత ప్రధాని మోదీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్, అహ్మదాబాద్ మెట్రోలో కూడా ప్రయాణించనున్నారు. ఈ కార్యక్రమం ప్రకారం.. భావ్‌నగర్‌లో ప్రపంచంలోనే మొట్టమొదటి అఔఉ టెర్మినల్‌కు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు. గురువారం ప్రధాని మోదీ శంకుస్థాపన చేసి, సూరత్‌లో రూ. 3,400 కోట్లు. అనంతరం ఆయన భావ్‌నగర్‌కు వెళ్లి శంకుస్థాపన చేసి రూ.కోటి విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. 5,200 కోట్లు. ఆయన నరేంద్ర మోదీ స్టేడియంలో 36వ జాతీయ క్రీడలను ప్రారంభిస్తారు. అహ్మదాబాద్‌లోని ఉఓఆఅ మైదానంలో జరిగే నవరాత్రి ఉత్సవాలకు హాజరవుతారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గుజరాత్‌లో తొలిసారిగా జాతీయ క్రీడలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఏడేళ్ల తర్వాత జాతీయ క్రీడలు జరుగనున్నాయి. 36వ జాతీయ క్రీడలను కూడా ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో సెప్టెంబర్ 29 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్న ఈ జాతీయ క్రీడల్లో .. 29న నరేంద్ర మోదీ స్టేడియంలో ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ గేమ్స్‌లో 7000 మంది ఆటగాళ్లతో సహా 13 వేలకు పైగా అనుబంధ అధికారులు పాల్గొంటారు. ఇందులో అహ్మదాబాద్‌లోని 6 ప్రదేశాల్లో 16 గేమ్‌లు జరగనున్నాయి. ఇందులో 7100 మంది క్రీడాకారులు పాల్గొంటారు. కాగా ముగింపు వేడుక అక్టోబరు 12న సూరత్‌లో జరగనుంది. సూరత్‌లో కూడా రెండు చోట్ల 4 గేమ్‌లు జరగనున్నాయి. అదే సమయంలో డ్రీమ్ సిటీ మొదటి దశను కూడా ప్రధాని నరేంద్ర మోడీ

3లో

# ఎనిమిదేళ్లలో తెలంగాణ ఎంతో ముందంజ



- అడగకున్నా అనేక పనుల చేసి చూపాం
- ప్రజల మద్దతుతోనే ఇదంతా సాధిస్తున్నాం
- మోడీ ఇన్నేళ్లలో ఒక్కమంచి పనికూడా చేశారా
- కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సభలో మంత్రి కెటిఆర్

3లో

# ఉద్యమాలకు దిక్సూచి కొండా లక్ష్మణ్

జయంతి సభలో మంత్రి జగదీశ్ రెడ్డి నివాళి



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** ఉద్యమాలకు దివంగత మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ దిక్సూచి లాంటి వారని విద్యుత్ శాఖామంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. నాటి క్విట్ ఇండియా మూమెంట్ మొదలుకొని ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు సాగిన ఉద్యమాలలో ఆయన భాగస్వామ్యం విస్మరించ లేనిదని ఆయన కొనియాడారు. మాజీమంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన చిత్ర పటానికి మంత్రి జగదీష్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. 1941 లో గాంధీజీని కలసిన ప్రేరణతో 1942 లో జరిగిన క్విట్ ఇండియా మూమెంట్ మొదలు కొని నిన్నటి ప్రత్యే తెలంగాణ ఉద్యమం వరకు ఆయన పోషించిన పాత్ర స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా 1947 నుంచి 1948 వరకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా సాయుధ పోరులో ఆయన పాత్ర అనిర్వచనియమైనదన్నారు. 1952 లో ముల్కి నిబంధనలను వ్యతిరేకిస్తూ సాగిన ఉద్యమంతో పాటు 1969 లో మొదలైన తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు తొలి ఉద్యమం నుంచి మొదలు కేసీఆర్ ప్రారంభించిన మలిదశ తెలంగాణా ఉద్యమం వరకు ఆయన పాత్ర ఆమోఘమైనదన్నారు. అలాంటి మహానేత గురించి ఒక్కటే మాటలో చెప్పాలి అంటే ఉద్యమాలకు దిక్సూచి అని చెప్పొచ్చన్నారు. కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి,చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్రెడ్డి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఫెమా నిబంధనలు ఉల్లంఘన కేసు

ఇడి ముందు విచారణకు హాజరైన ఎమ్మెల్యే మంచిరెడ్డి



హైదరాబాద్,సెప్టెంబర్ 27 (సమ సమాజం): ఇబ్రహీంపట్నం

3లో

# మునుగోడులో ముక్కోణం

బలం పుంజుకుంటున్న కాంగ్రెస్, డీలా పడుతున్న బీజేపీ

- ప్రచారంలో ఎదురుదాడి చేస్తు మంత్రి జగదీశ
- మంత్రి జగదీశ్వర్‌రెడ్డి టార్గెట్‌గా రాజగోపాల్‌రెడ్డి విమర్శల బాణాలు
- ఒంటరి ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి



**నల్లగొండ, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం వేడెక్కుతున్న వేళ దళితబంధుకు డిమాండ్ వస్తోంది. తమకూ దళితబంధు కావాలని ఇక్కడి దళితులు కోరుకుంటున్నారు. అయితే దీనికన్నా ముందే టిఆర్ఎస్ బిజెపిని ఎండగడుతూ సిలిండర్‌ను చూపుతూ ప్రచారం చేస్తోంది. ప్రధానంగా గ్యాస్, పెట్రో ధరలనే హైలెట్ చేస్తోంది. ఇకపోతే బిజెపిలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కెసిఆర్ నిరంకుశ విధానాలని, డబ్బుల పంపిణీని ప్రచారం చేస్తున్నారు. మొత్తంగా పార్టీలన్నీ అనేకంటే టిఆర్ఎస్, బిజెపి మాత్రమే పోటాపోటీగా ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతి కూడా రంగంలోకి దిగి బాగానే పోటీ ఇస్తోంది. ఇప్పుడు పోటీ రాజగోపాల్ రెడ్డి, మంత్రి జగదీశ్వర్‌రెడ్డిల మధ్య జరుగుతున్న పోరుగా మారింది. రంగంలోకి దిగిన మంత్రి జగదీశ్ రెడ్డి ఆ తర్వాత ఆయన కులాల వారీగా, వర్గాలవారీగా, వృత్తుల వారీగా,

3లో

# నయీం అనుచరుడు శేషన్న పట్టివేత

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** గ్యాంగ్‌స్టర్ నయీం ప్రధాన అనుచరుడు శేషన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తపేటలోని ఓ రెస్టారెంట్‌లో సెటిల్‌మెంట్ చేస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి ఓ పిస్తోల్ స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేటకు చెందిన శేషన్న.. కొంతకాలం పీపుల్స్ వార్ గ్రూపులో పనిచేసి ఆ తర్వాత లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోయాడు.



3లో

# రెండో విడత ఎంసెట్ కౌన్సిలింగ్ వాయిదా

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రంలో బుధవారం జరగాల్సిన ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్ వాయిదా పడింది. అక్టోబరు 11 నుంచి

3లో

# మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి

- వర్షాలు కురుస్తాంటూ వాతావరణశాఖ హెచ్చరిక
- నగరంలో అర్థరాత్రి వరకు వర్షంతో జనం బెంబేలు
- వేర్వేరు ప్రాంతాల్లో పిడుగుపాటుకు ముగ్గురు మృతి

3లో



## సంపాదకీయం

### కుటుంబ రాజకీయాలతో ప్రజాస్వామ్యం బలి

మనదేశంలో పేరుకే ప్రజాస్వామ్యం ... కానీ ఏళ్లుగా సాగుతున్నది మాత్రం ఏకవ్యక్తి స్వామ్యమే. పార్టీలన్నీ వ్యక్తుల గుత్తాధిపత్యంలోనే నడుస్తున్నాయి. పాలన కుటుంబ అజమాయిషీలో నడుస్తోంది. ఇదే నిరంకుశ పాలనకు దారితీస్తోంది. జాతీయ పార్టీలు మొదలు, ప్రాంతీయ పార్టీల వరకు అంతా ఇదే కోవలో నడుస్తున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కుటుంబ పాలన సాగుతోంది. కెసిఆర్, జగన్‌లు ప్రాంతీయ పార్టీల నేతలుగా రాజ్యామేలుతున్నారు. తమిళనాట కూడా స్టాలిన్ కుటుంబ రాజకీయాల నుంచి వచ్చిన వాడే. ఇప్పుడు ఆయన తనయుడు ఉదయనిధి కూడా వారసుడిగా ఎదుగుతున్నారు. కాంగ్రెస్ చరిత్ర అంతా కుటుంబ రాజకీయమే. ఇటీవల మళ్లీ రాహుల్‌కే పగ్గాలు అప్పగించాలని పిసిసి సభ్యులంతా డిమాండ్ చేశారు. పేరుకు అధ్యక్ష ఎన్నిక జరగబోతున్నా సోనియా ఆశిస్సులు ఉండి, వారి కనుసన్నల్లో నడిచే వారే రేపటి కాంగ్రెస్ అధ్యక్షులు అవుతారు. నెహ్రూ కుటుంబంలో మళ్లీ వారి వారసులను పార్టీ అధినేతలుగా కొనసాగించాలన్న బానిస భావం నుంచి పార్టీ నేతలు బయటపడడం లేదు. ఇకపోతే అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు నిరంకుశ పాలన సాగిస్తున్నాయి. కెసిఆర్ తరవాత ప్రభుత్వంలో కెటిఆర్, కవిత మాటలే చెల్లుబాటు అవుతాయి. తమ మాటకు ఎదురులేకపోవడంతో వారే పెత్తనం చెలాయిస్తున్నాయి. ఎపిలో జగన్ ఏకఛత్రాధి పత్యం చేస్తున్నారు. ఎంతో గొప్పగా మన గణ తంత్రాన్ని కీర్తిస్తూ, మనది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పొగుడుకుంటూ స్వాతంత్ర్యం సిద్ధించాక రూపొందించు కున్న మన రాజ్యాంగం పట్ల గౌరవం లేకుండా పాలన సాగుతున్న తీరు అపహాస్యం అవుతోంది. ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో ఈ రాజచరిక వ్యవస్థ ఆనవాళ్లు ఇంకా ప్రస్ఫుటంగా కనిపిస్తు న్నాయి. ప్రాంతీయ పార్టీల నేతలే అసలు సిసిలు రాజులుగా ఉంటున్నారు. వారిని ఎదరించి నిలబడే ధైర్యం పార్టీల నేతలకు ఉండడం లేదు. అంతే గాకుండా ప్రశ్నించే తత్వాన్ని కూడా భరించ లేనంతగా నిరంకుశ విధానాలు సాగుతున్నాయి. అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యంలో కూడా బలవంతులదే పెత్తనంగా మారింది. డబ్బున్నోళ్లదే రాజ్యంగా నడుస్తోంది. వారి ఆలోచనల మేరకే పాలన సాగుతోంది. పేదలుపేదలుగానే ఉంటున్నారు. పెద్దలు మరింత బలిసి పోతున్నారు. వీరే రాజ్యాధికారం చిక్కించుకుని తమకు అనుకూలంగా పాలన చేస్తున్నారు. ప్రధానంగా బిజెపి లాంటి పార్టీలో కూడా అంతర్గత ప్రజాస్వామ్యం లోపించింది. తన బుర్రకు వచ్చిన ఆలోచనలన్నీ పాటిస్తున్నారు. పార్టీలన్నీ కుటుంబ పాలనలో నడుస్తున్న చరిత్రను మనం చూస్తున్నాం. మన చరిత్ర లోతుల్లోకి వెళితే ఉన్న రాచరిక వ్యవస్థనే మనం ఆదరిస్తున్నాం. రాజ్యాలు పోయి రాజులు పోయినా ప్రజాస్వామ్యంలో ఇంకా రాచరిక పోకడలు పోలేదు. పెత్తందారీ వ్యవస్థ రద్దు కాలేదు. రాజులు చలాయించినట్లుగానే ఇప్పటికీ అధినేతలు తమ కనుసన్నల్లో పాలన సాగిస్తున్నారు. పెత్తనం ఏకవ్యక్తి చేతుల్లో నడుస్తోంది. ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడింది. తాము తీసుకున్న నిర్ణయాలను మమ అనిపించి అమలు చేస్తున్నారు. ప్రధాని మొదలు ముఖ్యమంత్రుల వరకు ఇదే తరహా పాలన సాగుతోంది. ప్రజాస్వామ్య ముసుగులో రాజరిక పాలన సాగుతోంది. ఏకవ్యక్తి నిర్ణయాలు అమలువుతున్నాయి. దీంతో ప్రజల ఇష్టాఇష్టాలు, బాగోగుల గురించిన చర్చ జరగడం లేదు. ఓటుబ్యాంక్ రాజకీయాలు దేశాన్ని దివాళా తీయిస్తున్నాయి. పేదరికం, పర్యావరణం, ప్రజా భద్రత.. ఇలా ప్రతిదాంట్లో మనం విఫలమయ్యాం. ఈ విషయంలో మోడీది కూడా ఏకవ్యక్తి పాలనగా సాగుతోంది. బిజెపిలో ఇప్పుడున్న వారంతా డమ్మీలే. మోడీ, అమిత్ షాలు తప్ప వేరెవ్వరూ నిర్ణయాత్మక పాత్రల్లో లేరు. గతంతో పోలిస్తే బిజెపి అంతా ఈ ఇద్దరి కనుసన్నల్లోనే నడుస్తోంది. అతిపెద్ద పార్టీగా ఉన్న బిజెపి గతంలో ఎప్పుడూ లేనంతగా నిరంకుశ భావ జాలంలోకి పోయింది. అందుకే పాలకులు తమకు నచ్చిన, తమకు అనుకూలమైన విధానాలనే అవలంబి స్తున్నారు. పాలనలో అవే ప్రతిఫలిస్తున్నాయి. అందుకే నేటి నిరంకుశ పాలకులు ప్రతి మనిషికీ కనీస అవస రాలైన కూడు, గూడు, గుడ్డ కల్పించగలుగుతున్నామా అన్నది ఆలోచన చేయడం లేదు. మహిళలు నేటికీ స్వేచ్ఛగా జీవించే అవకాశాలు లేకుండా విచ్చలవిడిగా తయారయ్యింది. నేరస్థులకు భయం లేకుండా పోతోంది. గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వాలే మద్యాన్ని బలవంతంగా అమ్మిస్తున్నారు. తమ బుర్రలో పుట్టిన, తమకు లాభం తెచ్చిపెట్టే పనులను పట్టాలకు ఎక్కిస్తున్నాం. తమ ఆలోచనలను ప్రజలపై రుద్దుతున్నారు. అధికారులతో చర్చించో లేదా చర్చించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారు. వాటినే గొప్పగా ప్రచాం చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వాటి పనితీరు అధ్యయనం చేయడం లేదు. ప్రధానిగా మోడీ పగ్గాలు చేపట్టిన తరవాత ఏకవ్యక్తి ఛత్రంలోకి పార్టీ వెళ్లింది. సీనియర్లు అద్వానీ, మురళీమనోహర్ జోషి,యశ్వతం సిన్హా, అరుణ్ శౌరి లాంటి వారికి మాట్లాడే అవకాశం లేకపోవ డంతో ఎవరికి వారు దారి చూసుకున్నారు. కొందరు పార్టీని వీడారు. కనీసంగా పార్టీలో వారికి ప్రవేశం కూడా లేకుండా చేశారు. దీంతో అంతర్గతంగా సమస్యలను చర్చించడానికి అవకాశం లేకుండా పోతోంది. ఇది ప్రజల సమస్యలను గుర్తించే అవకాశం లేకుండా చేసింది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావు. ధరలు పెరుగుతున్నా తగ్గించే మార్గాలు చూడరు. పెట్రో, గ్యాస్ ధరలు పెరుగుతున్న తీరు ప్రజల నడ్డి విరిచేదిగా ఉన్నా పట్టింపు లేదు. విద్యవైద్యం వంటి వారికి ఇంకా భరోసా లేదు. పేదల వైద్యానికి గ్యారెంటీ లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఏ రంగం లోనూ ప్రగతి సాధించ లేదు. గ్రామీణ ఆర్థికవ్యవస్థను చిన్నా భిన్నం చేశారు. ప్రజలను గండాల నుంచి గట్టెక్కించే బదులు మరో సుడిగుండంలోకి నెట్టేలా చర్యలు ఉంటున్నాయి. అంటే మన రాసుకున్న రాజ్యాంగం కొందరు పెద్దలు తీసుకున్న నిర్ణయాలపైన ఆధారపడి నడుస్తోంది. భవిష్యత్ అంటే భరోసా లేకుండా పోతోంది. ధరలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. వస్తూత్పత్తి తగ్గి దిగుమతులు పెరిగాయి. వ్యవసాయం చేయాలంటేనే రైతులు భయపడే దుస్థితి నెకొంది. కల్తీ సామ్రాజ్యం ఏలుతోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నా పట్టించుకోవడం లేదు. వచ్చే పదేళ్ళో, 20 ఏళ్ళకో ప్రణాళికలు అంటున్నా అవి కార్యాచరణ దాల్చడం లేదు. మన తర్వాతి తరాలను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యవంత మైన సమాజాన్ని ఇవ్వలేకపోతున్నాం. గతాన్ని అర్థం చేసుకుంటేనే భవిష్యత్‌ను చూడగలుగుతాం. నాగరికమనుకునే గతంలోకి చూసి... మరింత నాగరికమైన భవిష్యత్‌నెలా నిర్మించగలం? అన్నది మరచి అనాగరిక ప్రపంచాన్ని పెంచి పోషించేలా పాలకుల నిర్ణయాలు ఉంటున్నాయి. మా తరవాత ఎవరు ఏమైపోతే ఏంటన్న దృష్టిలో పాలకులు ఉన్నారు. ప్రజలు సంతృప్తితో.. సంతోషం గా ఉండాలని కోరుకున్నప్పుడే ప్రజారంజక పాలన సాగించిన వారు అవుతారు. అందుకు అంతర్గత ప్రజాస్వామ్యం పెరగాలి. పార్టీలో ప్రజా సమస్యలపై చర్చ చేయాలి. అందరి అభిప్రాయాల మేరకు నిర్ణయాలు ఉండాలి. క్షేత్రస్థాయిలో సమాచారం తెప్పించుకుని పార్టీలో చర్చించడం ద్వారా ప్రజాభిప్రాయానికి పార్టీల అధినేతలు పెద్దపీట వేయాలి. అప్పుడే రాచరిక పోకడలను రాకుండా చేసుకోగలం. ప్రజాస్వామ్యం బలపడగలదు.

పృథ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## తెలంగాణను అవమానించిన కిషన్ రెడ్డి



బయ్యారం ఉక్కుపై కిషన్ రెడ్డి వ్యాఖ్యలు దారుణం

విభజన హామీలపై ఎందుకీ వెనకడుగు

మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి సత్యవతి

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ సాధ్యం కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన ప్రకటన తెలంగాణ విభజన హామీలను తుంగలో తొక్కడమే గాకుండా, అవమానించడమేనని మంత్రి సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. ఇది కిషన్ రెడ్డి మాటనా.. లేక కేంద్ర ప్రభుత్వం వైఖరా స్పష్టం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి ప్రకటన తెలంగాణపై పిడుగుపాటు లాంటిదని మండిపడ్డారు. కిషన్ రెడ్డి తీరు చూస్తుంటే.. ఆయన తెలంగాణలోనే జన్మించారా? అన్న సందేహం కలుగుతోందన్నారు. ఆయన అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.బయ్యారం ఉక్కు తెలంగాణ హక్కు.. ఇక్కడి గిరిజనుల హక్కు అని సత్యవతి పేర్కొన్నారు. టీఆర్ఎస్ ఎల్పీలో ఎమ్మెల్యే రెడ్యా నాయక్, ఎంపీ మాలోత్ కవితతో కలిసి మంత్రి సత్యవతి రాథోడ్ మీడియాతో మాట్లాడారు.బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెడుతామని అప్పటి యూపీఏ ప్రభుత్వం పునర్వి భజన చట్టంలో హామీ ఇచ్చిందని సత్యవతి గుర్తు చేశారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీకి అనువైన పరిస్థితులు ఉన్నాయని నిపుణుల కమిటీ గతంలోనే చెప్పింది. 100 నుంచి 150 ఏండ్లకు సరిపడా ముడి ఉక్కు నిల్వలు బయ్యారంలో ఉన్నాయని తెలిపారు. కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి అయ్యాక తెలంగాణకు ఉపయోగపడే పని ఒక్కటైనా చేశారా? అని ప్రశ్నించారు. ఆయన ఉత్సవ విగ్రహంగా మారారు.. కేంద్ర మంత్రి పదవి ఆయనకు అలంకార ప్రాయమే అని విమర్శించారు. కిషన్ రెడ్డి తక్షణమే తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని మంత్రి డిమాండ్ చేశారు. ఏపీ పునర్విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అమలుపై కేంద్రం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఏపీలో గిరిజన విశ్వ విద్యాలయం పని చేస్తోంది.. కానీ తెలంగాణలో గిరిజన విశ్వ విద్యాలయం విషయంలో భూమి ఇచ్చినా కేంద్ర ప్రభుత్వం మీన మేషాలు లెక్క పెడుతోందని మండిపడ్డారు.

## దసరాకైనా టైమ్‌కు జీతాలు ఇస్తారా

ప్రతి నెలా లేట్ అయితే ఎలా సారూ

కెసిఆర్‌పై విజయశాంతి విసుర్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ ఉద్యోగులకు కేసీఆర్ సర్కార్ పండగపూట కూడా పైసలిచ్చేలా లేదని బీజేపీ నేత విజయశాంతి విమర్శించారు. ప్రతి నెలా జీతాలు ఆలస్యమవుతూనే ఉన్నాయని బీజేపీ నేత అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే అంశంపై సోషల్ మీడియా వేదికగా విజయశాంతి స్పందించారు. అక్టోబర్ 3న బతుకమ్మ, 5న దసరా పండుగలున్నాయని... కానీ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు జీతాల టెన్షన్ పట్టుకుందని అన్నారు. సరైన సమయానికి వేతనాలు వస్తాయా? లేవా? అనే ఆందోళనలో ఉద్యోగులున్నారని తెలిపారు. ఈ విషయంపైనే ఆర్థికశాఖ మల్లగుల్లాలు పడుతోంద న్నారు. గతేడాది కూడా పండుగ తర్వాతే జీతం జమ అయ్యిందని గుర్తుచేశారు. అక్టోబర్ మొదటివారంలోనే బతుకమ్మ, దసరా పండుగలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో టెన్షన్ మొదలైందన్నారు. ప్రతి నెలా ప్రభుత్వం ఆలస్యంగా వేతనాలు జమ చేస్తుండటంతో.. అక్టోబర్‌లోనూ అలాగే లేట్ అయితే... పండుగలకు పైసలెట్ల? అనే ఆందోళన మొదలైందని తెలిపారు. కనీసం వచ్చే నెలలో అయినా ఒకటో తేదీకి జీతాలొస్తే పండుగ షాపింగ్ చేయొచ్చనే ఆలోచనలో ఉన్నారని.... కానీ వేతనాలను ప్రభుత్వం ముందుగానే జమ చేస్తుందా? లేదా ఎప్పటిలాగే ఆలస్యంగా అందిస్తుందా? అనేది సస్పెన్స్‌గా మారిందన్నారు. ఏం కేసీఆర్... ఉద్యోగులతో ఇంకెన్ని రోజులు ఈ ఆటలు త్వరలో సర్కారీ ఉద్యోగులే... కేసీఆర్ సర్కార్‌ను పడగొట్టడం ఖాయం అంటూ విజయశాంతి వ్యాఖ్యలు చేశారు.

## షింజో అబే మరణం వ్యక్తిగతంగా తీరనిలోటు



➤ అబే అంత్యక్రియలకు హాజరనై ప్రధాని మోడీ

➤ ప్రస్తుత ప్రధాని ఫ్యుమియో కిషిదతో భేటీ

**టోక్యో, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** జపాన్ మాజీ ప్రధానమంత్రి షింజో అబే మరణం విషాదకరమని.. ముఖ్యంగా తనకు వ్యక్తిగతంగా తీరని లోటని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అబే అంత్యక్రియల కోసం జపాన్‌కు వెళ్లిన మోదీ.. జపాన ప్రధాని ఫ్యూమియో కిషిదతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని షింజో అబేతో తనకు ఉన్న అనుబంధాన్ని నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. గతంలో తాను జపాన్‌కు వచ్చినప్పుడు చాలా సమయం మాట్లాడకున్నామని చెప్పారు. భారత్, జపాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను అబే మరో ఎత్తుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మైత్రి బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుత ప్రధాని ఫ్యుమియో కిషిద సైతం అదే తీరును కొనసాగిస్తారనే నమ్మకం తనకు ఉందని చెప్పారు..మాజీ ప్రధాని షింజో అబే అంత్యక్రియల కోసం టోక్యో వెళ్లిన నరేంద్ర మోదీ.. జపాన్? ప్రధానమంత్రి ఫ్యుమియో కిషిదతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అబే అంత్యక్రియల కోసం జపాన్‌కు వచ్చిన నరేంద్ర మోదీకి ధన్యవాదాలు కిషజద తెలిపారు. అంతకుముందు మేలో జరిగిన క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొన్న మోదీ.. కిషిదతో సమావేశమయ్యారు. జపాన్ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం ప్రధానిగా పనిచేసిన అబే.. గత నెల హత్యకు గురయ్యారు. ఆయన నరా నగరంలోని ఓ వీధిలో లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం చేస్తుండగా ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. దీంతో అబే ఛాతీ పట్టుకుని వేదికపైనే కుప్పకూలారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అంత్యక్రియలు కూడా ముగిశాయి. కానీ అక్కడి ప్రభుత్వం మంగళవారం అధికారిక వీడ్కోలు పలకాలని నిర్ణయించింది. రెండోప్రపంచ యుద్ధం తర్వాత జపాన్ నిర్వహిస్తోన్న రెండో అధికారిక వీడ్కోలు కార్యక్రమమిది. అంతకుముందు 1967లో మాజీ ప్రధాని షిగెరు యోషిదాకు ఈ గౌరవం దక్కింది.

## ఆల్ ఇండియా మ్యారేజ్ బ్యూరో నల్లగొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**నల్లగొండ, సెప్టెంబర్, 27 (సమ సమాజం):** ఆల్ ఇండియా మ్యారేజ్ బ్యూరో నల్గొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎలక్షన్ లో జిల్లా అధ్యక్షుడిగా గోలి భూపాల్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎనుగుల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులుగా మహిళా కోట్ల సునీత, కొలి మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి కస్తూరి రాజు నాయుడు, జిల్లా కోశాధికారిగా బోనగిరి రమేష్, జిల్లా కార్యదర్శిగా కాసలా యాదగిరి రెడ్డి, మరోజు శ్రీనివాస చారి, జిల్లా కార్యనిర్వాహన కార్యదర్శిగా వీరమల్ల ప్రకాష్, బచ్చలకూర సునీత, జిల్లా కార్యదర్శిగా గుడి గుండ్ల వెంకటేష్ గౌడ్, మాలోత్ హనుమంతు నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షులుగా విద్యాసాగరు, గుమ్మడవెల్లి శ్రీదేవి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా, జిల్లా కన్వీనర్ గా ధరాల శివ యాదవ్, ప్రత్యేక సలహాదారుగా భాస్కరాచారి, కమిటీ సభ్యులు గా గోలి రజిత, తంగెళ్ళ శోభారాణి, తల్లం శ్రీనివాసు, భీమనమోని సైదులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖరా చారి ఆధ్వర్యం లో నూతన బాడీనీ ఎన్నుకోవడం జరిగింది.

## వర్షం దెబ్బకు కూలిన పాత ఇల్లు

ఇద్దరికి స్వల్పంగా గాయాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** మల్లేపల్లి, సాగర్ బస్తీలో వర్షం దెబ్బకు పాత ఇల్లు కూలిపోయింది. ఇంట్లో కుటుంబసభ్యులు ఉన్న సమయంలో కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. అయితే ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా కురిసిన కుండపోత వర్షంతో భాగ్యనగరం మరోసారి గజగజ వణికిపోయింది. రెండు గంటలకు పైగా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమై జనజీవనం స్తంభించిపోయింది. రోడ్లపై వరద ముంచెత్తడంతో కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ నిలిచిపోయి కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, దసరా పండుగ షాపింగ్ కోసం వాహనాలతో బయటకు వచ్చిన వారు నానా అవస్థలు పడ్డారు. సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, మలక్‌పేట్, కోఠి, మొజాంజాహి మార్కెట్, లక్డీకాపూల్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎర్రగడ్డ, బేగంపేట్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, హైటెక్ సిటీ, జేఎన్‌టీయూ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

నివాళి అర్పించిన మంత్రి కెటిఆర్ తదితరులు

మంత్రి జగదీశ్ తీరుపై మండిపడ్డ మాజీ ఎంపి బూర



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ వ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు.. కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో పోస్టు చేసిన ఆయన.. 'ఏ జలదృశ్యంలో అయితే ఉద్యమనాయకుడు కేసీఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ ఉద్భవించిందో, ఏ జలదృశ్యంలో అయితే అవమానకరంగా అప్పటి ప్రభుత్వం కూల్చివేసిందో.. ఈ రోజు అక్కడే శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించుకున్నాం. తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని సమున్నతంగా ఎగురవేశాం' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే మంత్రి జగదీష్ రెడ్డి పై మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం పేరుతో రాజకీయంగా లబ్ధిపొందిన వారు మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు అయ్యారు... కానీ వాళ్లంతా కాలగర్భంలో కలిసిపోయారని ఎద్దేవా చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్... తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రజల మనసులో ఉన్నాడన్నారు. ప్రతి గ్రామాల్లోనూ ఆయన జయంతి, వర్ధంతి ఉత్సవాలు ప్రజలే చేస్తున్నారని చెప్పారు. పార్టీ కార్యక్రమాలను కూడా సొంత కార్యక్రమాల్లాగా అనుకుంటే వాళ్లకు నష్టం తప్పదని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. తనని పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి పిలవకపోవడమంటే మునుగోడు నియోజకవర్గం ప్రజలను అవమానించడమేనని ఆరోపిం చారు. మునుగోడు టికెట్ అనేది అంత ముఖ్యమైనది కాదని, 6 నెలల పదవీకోసం ఇంత అవసరం లేదని విమర్శించారు. ఒకాయన పిలవనంతమాత్రాన తన స్థాయి తగ్గదని, వారి స్థాయి పెరగదని పరోక్షంగా జగదీశ్ రెడ్డిపై విమర్శలు చేశారు. అహంకారం అనేది వారి సొంత సమాధికి పునాది లాంటిదన్నారు. వ్యక్తిగత ఆహ్వానాలు, చిల్లర రాజకీయాల కొరకు తాను ఉండనని, తనకు కేసీఆర్ ఒక్కడే నాయకుడని, మిగతా లిల్లీపుట్స్‌ను పట్టించుకోనన్నారు.

## తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన కొండా

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఘనంగా జయంతి వేడుకలు

నివాళి అర్పించిన మంత్రి శ్రీనివాస గౌడ్



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 27 (సమ సమాజం):** : స్వాతంత్ర్య సమరయోధుడు, మూడు తరాల తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నేత అన్నారు. ప్రజాసేవకుడిగా అనేక ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. శాసన సభ్యుడిగా, మంత్రిగా బడుగు బలహీన వర్గాల సంక్షేమమే పరమావధిగా భావించి తన సర్వస్వం ధారపోశారన్నారు.బాపూజీ జయంతి సందర్భంగా న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి సేవలను, వారితో ఉన్నా అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ బహుముఖ ప్రజ్ఞశాలి అన్నారు. స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మకు అండగా నిలిచిన న్యాయవాదిగా పలు రకాలుగా సేవలందించారు. కార్యక్రమంలో టూరిజం ఎండీ మనోహర్, టీఎన్‌జీవో అధ్యక్షుడు రాజేందర్, టీజీవో కోశాధికారి పుల్లెంల రవి కుమార్ గౌడ్, భాగ్యనగర్ టీఎన్‌జీవో అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. న్యూఢిల్లీ తెలంగాణ భవన్ లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ జ్యోతి ప్రజ్వలన చేసి లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ తెలంగాణ సమాజానికి బాపూజీ చేసిన సేవలు మరువలేనివన్నారు. తొలి, మలిదశ తెలంగాణ పోరాటంలో ఆయన పాల్గొన్నారని గుర్తు చేశారు. తన జీవిత కాలమంతా అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన గొప్ప నాయకుడు బాపూజీ అన్నారు.

## సొంత నిధులతో అభివృద్ధి పనులు

మునుగోడు ఉపఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి స్రవంతిని గెలిపించుకుంటాం : నర్రి జగదీష్

ఆ పార్టీ కేంద్రంలో అధికారంలో లేదు, రాష్ట్రంలో కూడా అధికారంలో లేదు. అయినా మునుగోడు ప్రజల అభివృద్ధే లక్ష్యంగా మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఉప ఎన్నిక అభ్యర్థి పాల్వాయి స్రవంతి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. మునుగోడు నియోజకవర్గంలో ఎలాంటి సమస్యనైనా తన దృష్టికి వస్తే సాయ శక్తుల సమస్యను పరిష్కారిస్తున్నారు.



మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిలో భాగ ంగా నాటి దివంగత మాజీ శాసన సభ్యులు పాల్వాయి గోవర్ధన్ రెడ్డి హయాంలో గుజ్జ గ్రామం నుండి చల్మెడ వరకు రోడ్డు వేయించారు. కాలక్రమేనా ఆ రోడ్డు గుంతల మయం అవడంతో పాల్వాయి స్రవంతి దృష్టికి తీసుకెళ్లారు ఆ గ్రామ ప్రజలు. ప్రజలు కోరుకున్న విధంగా సత్వరమే ఆ రోడ్డు మరమ్మత్తులు చేపట్టేందుకు తన సొంత నిధులను ఖర్చు చేసి రోడ్డు వేయిస్తు న్నారు.



**నారాయణపురం, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా ప్రజల అవసరాలను గుర్తించి సమస్యలపై పోరాటం చేస్తూ, అవసరమైతే తన సొంత నిధులను ఖర్చు చేసి సమస్యలను తీర్చుతున్న పాల్వాయి స్రవంతి పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపురం మండలం గుజ్జ గ్రామం నుంచి చల్మెడ రోడ్డును తమ సొంత ఖర్చులతో మరమ్మతులు చేపడుతున్నారు పాల్వాయి స్రవంతి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నారాయణపురం మండల ఉపాధ్యక్షుడు నర్రి జగదీష్ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటుందని, జరగబోయే ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ ఎర్ర వెంకటేష్, చాపల రాజేందర్, ఎర్ర కల్పనా పరమేష్, ఎర్ర సైదులు, బొజ్జ వెంకటేశ్వర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్యతో సంబంధం లేదని ప్రమాణం చేయండి

సిఎం జగన్‌కు నారా లోకేశ్ సవాల్

**అమరావతి, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తమకు ఎలాంటి సంబంధం లేదనిశ్రీవారి సాక్షిగా ప్రమాణం చేసేందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి సిద్ధమా? అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు జగన్‌కు ట్విట్టర్ వేదికగా సవాల్ విసిరారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గనేందుకు తిరుమల వెళ్తున్న సీఎం జగన్.. ఈ విషయంపై అక్కడ ప్రమాణం చేస్తారా? అని ప్రశ్నించారు.

## నిబద్ధ రాజకీయవేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ

### విగ్రహావిష్కరణ సభలో మంత్రి ఎర్రబెల్లి

**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రం కోసం తన మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధతగల రాజకీయవేత్త దివంగత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భం గా ట్యాంక్ బండ్ వద్ద జలదృశ్యంలో ఆయన విగ్రహాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో మంత్రి ఎర్రబెల్లి పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమం, నిజాం వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న గొప్ప నేత బాపూజీ అన్నారు. స్వరాష్ట్రం కోసం 75ఏళ్లు ఉద్యమం చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కొరకు కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయ ఏర్పాటుకు తాను ఉంటున్న జల దృశ్యాన్ని అప్పగించిన మహోన్నత వ్యక్తి గా కొండా లక్ష్మణ్ బాపూజీ చరిత్రలో నిలిచిపోతారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర చేనేత సహకార రంగానికి అనేక సేవలు చేశారని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు నేటి తరానికి అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్, వరంగల్ మహా నగర మేయర్ గుండు సుధారాణి, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ ఉన్నారు.

# మూడు రాజధానులు కాదు.. మూడు రాష్ట్రాలు చేయండి

- ముగ్గురు సిఎంలు కావాలన్న కోరికా తీరుతుంది
- ఎపి సిఎం జగన్ తీరుపై జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ఆరోగ్యశ్రీ సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపణ

**సంగారెడ్డి, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** ఏపీలో మూడు రాజధానుల వ్యవహారంపై సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధానులు మేడు కన్నా .. మూడు రాష్ట్రాలు చేస్తే మేలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. అలా చేస్తే సీఎం పదవి కోసం జగన్ కుటుంబంలో ఉన్న గొడవ తీరుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పట్ల సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇచ్చినా కలవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 3 రాజధానుల కంటే 3 రాష్ట్రాలు చేస్తే మేలని అన్నారు. అలా అయితే జగన్ కుటుంబంలో సీఎం పదవి కోసం ఉన్న గొడవ తీరుతుందని వ్యాఖ్యానించారు. మూడు రాష్ట్రాల్లో.. ఒకచోట జగన్, ఇంకోచోట షర్మిల, మరోచోట విజయసాయి సీఎం కావొచ్చని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. అలాగే రాష్ట్రంలో వైద్యారోగ్య రంగంలో నెలకొన్న సమస్యలపై పలు ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య శ్రీ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. కుటుంబ పంచాయితీని జగన్, షర్మిల తెలంగాణకు వచ్చి పెట్టడం సరికాదు. అవసరమైతే మోదీతో మాట్లాడి.. సమస్యను పరిష్కరించుకోవాలి. నన్ను కోవర్ట్ అని షర్మిలే కాదు.. మా పార్టీ వాళ్లూ అన్నారు. షర్మిల నా జోలికి రాకుంటే నేను ఆమె జోలికి వెళ్లను. జగన్, షర్మిలలు ఇంకా ఆస్తులు కూడా పంచుకోలేదని జగ్గారెడ్డి అన్నారు. ఆరోగ్య శ్రీ పథకం అమలు సరిగ్గా లేదని జగ్గారెడ్డి మండిపడ్డారు. క్యాన్సర్ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వైద్యం చేయించుకున్నాక సీఎం సహాయనిధి నుంచి రూ.30 వేలే వస్తున్నాయని అన్నారు.ఆరోగ్యశ్రీ సక్రమంగా అమలయ్యేలా కేసీఆర్, హరీశ్‌రావులు చూడాలని జగ్గారెడ్డి కోరారు. సీఎం సహాయనిధి నుంచి మంజూరయ్యే మొత్తం పెంచాలన్నారు. రాష్ట్రంలో సీఎం అపాయింట్‌మెంట్ ఇచ్చినా కలవలేని పరిస్థితి నెలకొందన్న జగ్గారెడ్డి.. ఒకవేళ కలిసినా తప్పు పట్టే పరిస్థితులు వచ్చాయన్నారు.

## రెండ్రోజుల పాటు మోడీ గుజరాత్ పర్యటన



(మొదటి పేజి తరువాయి) ప్రారంభించనున్నారు. అంబాజీలో రూ. 7,200 కోట్లు. అంబాజీ ఆలయంలో ఆయన పూజలు నిర్వహించనున్నారు. అదే సమయంలో కొత్త బ్రాడ్ గేజ్ లైన్‌కు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. దీని ద్వారా అంబాజీకి యాత్రికులు సులభంగా ప్రయాణించవచ్చు. ప్రధానమంత్రి అంబాజీ ఆలయాన్ని కూడా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం అహ్మదాబాద్‌లో జరిగే నవరాత్రి ఉత్సవాల్లో కూడా ప్రధాని మోదీ పాల్గొననున్నారు. అదే రోజు అహ్మదాబాద్‌లోని అహ్మదాబాద్ ఎడ్యుకేషన్ సొసైటీలో జరిగే బహిరంగ కార్యక్రమంలో ప్రధాని మోదీ అహ్మదాబాద్ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్-1ను ప్రారంభిస్తారు. కోటి రూపాయలకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేయనున్నారు. ఈ సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా గుజరాత్ పర్యటనలో ఉండటం గమనార్హం. ఆ. అమిత్ షా ఆరోజు తన గాంధీనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ప్రాంతాల్లో వివిధ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. మంగళవారం గాంధీనగర్ జిల్లా కలోల్ పట్టణంలో 750 పడకల ఆసుపత్రి శంకుస్థాపన చేయనున్నారు.

# రెండో విడత ఎంసెట్ కౌన్సిలింగ్ వాయిదా

(మొదటి పేజి తరువాయి) ఎంసెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అక్టోబరు 11, 12 తేదీల్లో రెండో విడత బుకింగ్ ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. అక్టోబరు 12న రెండో విడత ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. అక్టోబరు 12, 13న రెండో విడత వెబ్ ఆప్షన్లు ఇస్తారు. అక్టోబరు 16న రెండో విడత ఇంజినీరింగ్ సీట్లను కేటాయించనున్నారు. ఫీజులు అంశం కొలిక్కి రాకపోవడంతో రెండో విడత కౌన్సెలింగ్ వాయిదా పడింది.

# ఆస్ట్రేలియా పార్లమెంట్ ముందు బతుకమ్మ సందడి

### ఆడిపాడిన తెలంగాణ వాసులు..జతకట్టిన స్థానిక మహిళలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర సంస్కృతిని ఖండాతరాల్లో వ్యాపింపజేసిన గొప్ప పండుగ బతుకమ్మ. మన తెలుగు వారు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా సరే మన సాంప్రదాయలను, సంస్కృతిని వెలుగెత్తి చాటుతున్నారు. తాజాగా ఆస్ట్రేలియాలో ఉన్న తెలుగు వారు ఆ దేశ పార్లమెంట్ ఎదుట బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి అక్కడి తెలుగు వారితో పాటు ఆస్ట్రేలియా మహిళలూ తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఉత్సాహంగా ఆడి పాడారు. తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియన్ పార్లమెంట్ ఎదుట ఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు వారితో పాటు ఆస్ట్రేలియా మహిళలు, అక్కడి ప్రజాపతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎనిమిదేళ్లలో తెలంగాణ ఎంతో ముందంజ



(మొదటి పేజి తరువాయి) **రాజన్నసిరిసిల్ల, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** ఎవరు అడిగినా..అడగకున్నా తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చే క్రమంలో సిఎం కెసిఆర్ ముందున్నారని, సమరయోధులను కూడా గౌరవించుకుంటున్నామని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. ఎనిమిదేళ్ల పాలనలో ఎన్నో మార్పులు తెచ్చి తెలంగాణ స్వరూపాన్ని మార్చుకున్నామని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఇలా ఒక్క పనయినా చేసిందా అని మంత్రి విమర్శించారు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమం సహా అనేక పోరాటాలు చేశారని మంత్రి కేటీఆర్ కొనియాడారు. బాపూజీ పోరాటాలు మరువలేనివి అని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో మానేరు నది సమీపంలోని ఎల్లమ్మ గుడి వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాపూజీకి ఘన నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. స్వాతంత్ర్యం రాక ముందే కాదు.. వచ్చిన తర్వాత కూడా తెలంగాణ ఉద్యమంలో బాపూజీ ముందంజలో ఉన్నారని గుర్తు చేశారు. ఉద్యమంలో తానూ పోరాటం చేయడమే కాదు పోరాట యోధులకు సహకారం అందించారని తెలిపారు. అప్పటి ప్రభుత్వం జలదృశ్యంలో తన ఇంటిని తీసి బయట పడేశారో అక్కడే ప్రభుత్వం 20 అడుగుల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణ వైతాళికుల గొప్పదనాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేసేందుకే విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎవ్వరూ అడగకుండానే తెలంగాణలో కొత్త జిల్లాలకు, యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ వైతాళికుల పేరు పెట్టామని స్పష్టం చేశారు. తెలంగాణ వైతాళికులను గౌరవించుకోవాలనే సంస్కారం ప్రభుత్వానికి ఉందన్నారు. సిరిసిల్లలో కొత్త చెరువు ట్యాంక్ బండ్, కొత్త జంక్షన్‌ల వద్ద రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ ఖర్చులతో మహనీయుల విగ్రహాలు పెట్టుకుందామని చెప్పారు. మీ ఆశీస్సుల వల్లే ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. మీ రుణం తీర్చుకునేందుకే శాశ్వత సమస్యలకు పరిష్కారం చేస్తున్నానని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన అభివృద్ధి చాలదు. ఇంకా జరగాల్సింది చాలా ఉంది. దశల వారీగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని పేర్కొన్నారు. వరంగల్‌లో 1250 ఎకరాలలో మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం జరుగుతుందని కేటీఆర్ తెలిపారు. దీని ద్వారా 20, 30 వేల మందికి ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. నేతన్నల సంక్షేమం కోసం రూ. 50 లక్షలు విరాళాలు సేకరించి ఆర్థిక సహాయం అందజేశారు. రూ. 70 కోట్ల బ్జడెట్‌ను రూ. 1200 కోట్లకు పెంచామని తెలిపారు. కులమతాలకు అతీతంగా సీఎం కేసీఆర్ తన పాలన కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. అన్ని వర్గాల అభివృద్ధికి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలి



(మొదటి పేజి తరువాయి) **హైదరాబాద్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** మూడు రోజులుగా పొడి వాతావరణం ఏర్పడటం.. ఉరుములు, మెరుపులు అధికంగా రావడం వల్ల కొన్ని గంటల వ్యవధిలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇవాళ, రేపు రాష్ట్రంలో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఇదిలావుంటే సోమవారం రాత్రి వివిధ జిల్లాల్లో పిడుగుపాటుకు గురై ముగ్గురు మరణించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మామిడిగుండాల పంచాయతీ బోటిగుంపునకు చెందిన రైతు కమటం శ్రీను పిడుగుపాటుతో మృతి చెందారు. తన భార్య శోభతో పొలానికి వెళ్లి ఇంటికి వస్తుండగా పిడుగుపడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో పిడుగుపడి షేక్ జాన్‌బీ చనిపోయారు. కొంతకాలంగా అనారోగ్యంతో మంచం పట్టిన ఆమె.. ఇంటి ఆవరణలో పిడుగు పడటంతో మంచంలోనే మృతి చెందింది. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని బావుల చెరువు సమీపంలో చెట్టుకింద నిలబడ్డ సిద్దాపురానికి చెందిన ముసుకు నాగరాజు పిడుగు బారినపడి అక్కడికక్కడే కన్నుమూశారు. ఇకపోతే భారీ వర్షం కారణంగా సోమవారం రాత్రి హైదరాబాద్ వణికింది. మంగళవారం కూడా ఆకాశం మేఘావృతం అయ్యింది. నిలిచిపోయి.. పలుచోట్ల అంధకారం అలుముకుంది. ఎడతెరిపి లేకుండా కురవడంతో వాగులు, వంకలు, నాలాలు పొంగిపొర్లాయి. కొన్నిచోట్ల రహదారులు చెరువులను తలపించాయి. సహాయ చర్యల కోసం జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. ఉదయం కూడా సహాయక చర్యలు కొనసాగాయి.

# ఫెమా నిబంధనలు ఉల్లంఘన కేసు



(మొదటి పేజి తరువాయి) టీఆర్ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఈడీ ఎదుట హాజరయ్యారు. ఫెమా నిబంధనల ఉల్లంఘన కేసులో మంచిరెడ్డి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనల ఉల్లంఘనలపై వివరణ ఇవ్వాలంటూ ఆగస్టులో ఈడీ అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చారు. తాజాగా విచారణ నిమిత్తం ఆయన ఈడీ ఆఫీసుకు వెళ్లారు. ప్రస్తుతం ఈడీ అధికారులు ఎమ్మెల్యే మంచిరెడ్డి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నట్లు తెలుస్తోంది. మంచిరెడ్డి కిషన్ రెడ్డిని ఈడీ అధికారులు దాదాపు 2 గంటలుగా ప్రశ్నించారు. బ్యాంకు లావాదేవీలపై వారు ఆరా తీసినట్లు సమాచారం. గోల్డ్ మైన్ కు సంబంధించిన వ్యాపారాల్లో జరిగిన అవకతవకలపై అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఈడీ నోటీసులపై గతంలోనే మంచిరెడ్డి కిషన్ రెడ్డి వివరణ ఇచ్చారు. అయితే దానిపై ఈడీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మంచిరెడ్డి స్వయంగా ఈడీ విచారణ హాజరైనట్లు సమాచారం.

# మునుగోడులో ముక్కోణం

### బలం పుంజుకుంటున్న కాంగ్రెస్, డీలా పడుతున్న బీజేపీ

(మొదటి పేజి తరువాయి) సంఘాల వారీగా ఆత్మీయ సమావేశాలు నిర్వహించి వారంతా టిఆర్ఎస్ వెంటే ఉన్నారంటూ ప్రచారం చేస్తున్నారు. ఆయన ఇక్కడే మకాం వేసి పార్టీ వ్యూహాలను అమలు చేయడంలో క్రియాశీలకంగా సాగుతున్నారు. టీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా కొనసాగే అవకాశాలు ఉంటాయని ప్రజల్లో అభిప్రాయం కలిగించారు. ప్రచారపర్వంలో రాజగోపాల్‌పై వ్యక్తిగతంగా, రాజకీయంగా విమర్శల దాడిని పెంచి సానుభూతి పవనాలను లేవనే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి పేరెత్తకుండా గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచిన బీజేపీకి ఓటేద్దామా, రైతుల నడ్డివిరిచే చట్టాలు తీసుకువచ్చిన బీజేపీని గెలిపిద్దామా అంటూ బీజేపీపై రాజకీయ దాడిని ప్రారంభించారు. తద్వారా పరోక్షంగా ఆ పార్టీ అభ్యర్థిగా ఉన్న రాజగోపాల్ ప్రభావాన్ని తగ్గించడానికి మంత్రి జగదీశ్వర్ రెడ్డి కొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. అలాగే అన్ని పార్టీల నుంచి అగ్రనేతలు నియోజకవర్గానికి వస్తున్నారు. ఉప ఎన్నిక ప్రచారం నాటికి ముఖ్యమంత్రి కేసీఆర్ వస్తారని ఇప్పటికే ప్రకటించారు. మునుగోడులో బిజెపిని ఓడిస్తేనే టిఆర్ఎస్ రాజకీయంగా నిలదొక్కుగోగలదు. ఈ క్రమంలోనే బిజేపీ, ఇటు టీఆర్ఎస్ అదే లక్ష్యంతో గెలుపు కోసం ప్రచారంలో పరుగులు పెడుతున్నాయి. కేసీఆర్ వ్యూహరచనను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ మంత్రి ఇక్కడ ప్రచారాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. రాజగోపాల్ రాజీనామా తర్వాత సుదీర్ఘంగా జరుగుతున్న ఎన్నికల ప్రచారంగా మునుగోడు నిలిచి పోతుంది. బీజేపీకి పార్టీపరంగా ఇక్కడ పెద్దగా పట్టు లేకున్నా రాజగోపాల్ పార్టీలో చేరడంతో ప్రధాన పోటీదారుగా మారారు. కాంగ్రెస్, బీజేపీ, తదితర పార్టీల్లోని పలువురు నాయకులను, ముఖ్య కార్యకర్తలను కూడా ఆకర్షించి టీఆర్ఎస్‌లో చేరేలా చేసి నియోజకవర్గంలో పార్టీకి మరింత జవసత్వాలను మంత్రి ఇస్తున్నారు. ప్రజాక్షేత్రంలో నువ్వానేనా అన్నట్లుగా ప్రచారం కొనసాగిస్తున్న బీజేపీ అభ్యర్థి రాజగోపాల్‌కు అండగా నిలిచేందుకు బీజేపీ యంత్రాంగం అంతా రంగప్రవేశం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తుంది. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచార యాత్రలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, స్టార్ క్యాంపెయినర్ విజయశాంతి, ఎమ్మెల్యేలు రఘునందన్‌రావు, ఎంపీ ధర్మపురి అరవింద్, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, హిమాచల్ ప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, స్టార్ క్యాంపెయినర్ బాబు మోహన్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ తదితర పెద్దలు నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేస్తారని చెబుతున్నారు. ఆర్ఎస్ఎస్ శ్రేణులు ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మకాం వేసి ఓటర్లను వ్యక్తిగతంగా కలిసే ప్రయత్నాలు చేస్తున్నాయి. మునుగోడు పోటీని ముక్కోణంగా మార్చుతామని కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తున్నది. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ పార్టీ నాయకులు, శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ప్రచారం ఉధృతం చేసి చివరి రెండు రోజులు ఓటర్లను పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కనీసం ఐదారు రోజులు నియోజక వర్గంలో పర్యటించి ప్రచారాన్ని విస్తృతం చేయాలని పార్టీ నాయకులు భావిస్తున్నారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, ఇతర ముఖ్య నాయకులు కూడా ప్రచారంలో పాల్గొని అభ్యర్థి పాల్వాయి స్రవంతి గెలుపు కోసం కృషి చేస్తారని, హోరాహోరీగా సాగే ముక్కోణపు పోటీలో కాంగ్రెస్ కూడా గెలుపు దారిలో ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

## బ్రహ్మచారిణి అవతారంలో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు

**నిర్మల్, సెప్టెంబర్ 27 (సమ సమాజం):** బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు బ్రహ్మచారిణి అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి పుష్పార్చన, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవార్లను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలి వస్తున్నారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## నయీం అనుచరుడు శేషన్న పట్టివేత

(మొదటి పేజి తరువాయి) అప్పటి నుంచి నయీం ప్రధాన అనుచరుడిగా కొనసాగుతూ.. బెదిరింపులు, హత్యలు, హత్యాయత్నాల వంటి అనేక కేసుల్లో నయీంతో పాటు శేషన్న కూడా నిందితుడుగా ఉన్నాడు. 2016లో షాద్‌నగర్‌లో జరిగిన ఎంకౌంటర్‌లో నయీం మృతి చెందగా.. అప్పటి నుంచి శేషన్న పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇన్నాళ్లకు సరైన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శేషన్నను పట్టుకున్నారు.

## ప్రత్యేక దర్శనాలు రద్దు

### కేవలం ఇక సర్వదర్శనాలే

**తిరుమల, సెప్టెంబర్, 27 (సమ సమాజం):** శ్రీవారి దర్శన వేళల్లో తిరుమల తిరుపతి దేవస్థానం కొన్ని మార్పులు చేసింది. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా.. స్వామివారి దర్శన వేళల్లో మార్పులు చేసింది. మంగళవారంనుంచి అక్టోబర్ 5 వరకూ శ్రీవారి ఆలయంలో.. ప్రత్యేక దర్శనాలు అన్నింటినీ టీటీడీ రద్దు చేసింది. ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం సర్వదర్శనం గుండానే.. భక్తులను స్వామివారి దర్శనానికి టీటీడీ అనుమతించనుంది. శ్రీవారి బ్రహ్మోత్సవాలు సాయంత్రం ధ్వజారోహణంతో ఆలయ పూజారులు ప్రారంభించనున్నారు. అత్యంత వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వం తరపున సీఎం జగన్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రి 9 గంటలకు పెద్ద శేషవాహనంపై భక్తులకు.. కోనేటి రాయుడు దర్శనం ఇవ్వనున్నారు. కోనేటిరాయుడు వాహనసేవలో సీఎం జగన్ పాల్గొననున్నారు. బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## మునుగనూరులో ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



**హయత్ నగర్, సెప్టెంబర్, 27 (సమ సమాజం):** శ్రీశ్రీ జై దుర్గా యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి రోజు మన్నె శశిధర్ తమ కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ దేవి దుర్గామాత కు పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని, మా కుటుంబంతోపాటు రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరినట్టుగా చెప్పారు. ఈరోజు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతృప్తిగా ఉందని తెలిపారు.




# చలన చిత్రం




## చిరు ఇమేజ్‌కి తగ్గట్లుగా తెలుగు నేటివిటీ

### లూసిఫర్ మార్పులతో గాడ్ ఫాదర్

మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం 'గాడ్ ఫాదర్' మలయాళంలో బ్లాక్ బస్టర్ హిట్టైన 'లూసిఫర్' సినిమాకు అధికారిక తెలుగు రీమేక్ అనే సంగతి తెలిసిందే. కాకపోతే చిరు ఇమేజ్ - తెలుగు నేటివిటీ మరియు మెగా ఫ్యాన్స్ ని దృష్టిలో పెట్టుకొని తగినన్ని మార్పులు చేర్పులు చేశారు. నిజానికి చిరంజీవి 'లూసిఫర్' చిత్రాన్ని రీమేక్ చేస్తున్నాడనే వార్త బయటకు వచ్చినప్పుడే.. ఈ ప్రాజెక్ట్ తెలుగులో వర్క్ అవుట్ అవుతుందా అనే కామెంట్స్ వచ్చాయి. దీనికి కారణం.. ఒరిజినల్ వెర్షన్ లో కథానాయకుడి పాత్రకు హీరోయిన్ ఉండదు.. పాటలకు అవకాశం లేదు. అందులోనూ హీరో మిడిల్ ఏజ్ లో రోల్ లో కనిపిస్తాడు. ఇవన్నీ పరిగణలోకి తీసుకునే.. మెగాస్టార్ రేంజ్ కు ఈ పొలిటికల్ థ్రిల్లర్ ఎలా ఉంటుందో అని అందరూ ఆలోచించారు. దీనికి తోడు హీరోయిన్ లేకుండా చిరంజీవి నటించిన 'ఆచార్య' సినిమా డిజాస్టర్ గా నిలిచింది. దీంతో 'గాడ్ ఫాదర్' సినిమా ఎలా ఉంటుందో అని మెగా అభిమానులు కాస్త ఆందోళనకు గురయ్యారు.అయితే ఇప్పటి వరకూ వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ ని బట్టి చూస్తే.. ఫ్యాన్స్ కోసం చాలానే చేంజెస్ చేసారనిపిస్తోంది. ఒరిజినల్ లో లేని విధంగా 'తార్ మార్ తక్కర్ మార్' వంటి పార్టీ సాంగ్ ని జత చేశారు. ఈ నేపథ్యంలో 'గాడ్ ఫాదర్' లో ఓ ఐటమ్ సాంగ్ ని పెట్టినట్లు సమాచారం. ఈ ప్రత్యేక గీతం కోసం స్పెషల్ సెట్ వేసి కోటిపైగానే ఖర్చు చేసారట. 'బింబిసార' సినిమాలో స్పెషల్ సాంగ్ లో ఆడిపాడిన వారినా హుస్సేన్.. 'గాడ్ ఫాదర్' ఐటెమ్ భామగా కనిపించనుందని టాక్.ఇకపోతే ఈ ప్రత్యేక పాటలో చిరంజీవి భాగం అవుతాడు కానీ.. ఐటమ్ బ్యూటీతో కలిసి స్టెప్పులు వేసే అవకాశం లేదు. ఎందుకంటే ఇది విలన్ డెన్ లో వచ్చే పాట. చిరు ని కేవలం ఇంటర్ కట్స్ లో మాత్రమే చూపిస్తారని తెలుస్తోంది. వాస్తవానికి ఒరిజినల్ లోనూ 'రాఫ్తారా' అని స్పెషల్ సాంగ్ ఉంది. మరి తెలుగులో దీన్ని ఏవిధంగా చూపిస్తారో చూడాలి. కాగా 'గాడ్ ఫాదర్' సినిమాలో బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్ కీలక పాత్ర పోషించారు. నయనతార - సత్యదేవ్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూర్చగా.. నీరవ్ షా సినిమాటోగ్రఫీ అందించనున్నారు. సురేష్ సెల్వరాజన్ ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరించారు.దసరా సందర్భంగా అక్టోబర్ 5న గాడ్ ఫాదర్ విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అనంతపురంలోని జేఎన్టీయూ గ్రౌండ్స్ లో గ్రాండ్ గా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ప్లాన్ చేశారు.

## మాలీవుడ్ నటుడు శ్రీనాథ్ భాసి అరెస్ట్



మాలీవుడ్‌లో మంచి పాపులారిటీ ఉన్న నటుల్లో శ్రీనాథ్ భాసి ఒకరు. ఈయన నటించిన తాజా చిత్రం 'చట్టంబి'. త్వరలో విడుదల కానున్న ఈ మూవీ ప్రమోషన్స్‌ని చిత్రబృందం జోరుగా నిర్వహిస్తోంది. ఈ తరుణంలో జరిగిన ఓ ఇంటర్వ్యూలో యూట్యూబ్ ఛానెల్‌కు చెందిన మహిళా యాంకర్, కెమెరా సిబ్బందిని దుర్భాషలాడారనే అభియోగంపై ఈ నటుడు శ్రీనాథ్ భాసి సోమవారం కొచ్చిలో అరెస్టు చేశారు. ఈ ఇంటర్వ్యూ సమయంలో కెమెరాలు స్విచ్ ఆఫ్ చేయమని చెప్పిన భాసి తనపై, కెమెరా సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తించాడని యాంకర్ ఫిర్యాదు మేరకు శుక్రవారమే కేసు నమోదైంది. అనంతరం పోలీసుల సమాచారం మేరకు.. తన లాయర్‌తో కలిసి స్టేషన్‌కు చేరుకున్న శ్రీనాథ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం అతడిపై మరిన్ని కేసులు పెట్టాలా వద్దా అనే విషయంపై పోలీసులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇంటర్వ్యూ జరిగిన హోటల్‌లోని సీసీటీవీ విజువల్స్, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఓ ఇంటర్వ్యూలో నటుడు రేడియో జాకీని దుర్భాషలాడిన మరో క్లిప్ ఇటీవల వైరల్ అయ్యింది.



## అయోధ్యలో అర్జునుడు

### త్రివిక్రమ్, మహేశ్ సినిమా టైటిల్‌పై ట్రెండ్

సూపర్‌స్టార్ మహేష్ బాబు, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో హ్యాట్రిక్ చిత్రంగా తెరకెక్కుతోన్న ఎస్ఎస్ఎంబి 28' చిత్రం ఇటీవల షూటింగ్ ప్రారంభించుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ చిత్రం పేరు ఫలానా అంటూ ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ వార్త సంచలనంగా మారింది. టాలీవుడ్ అగ్ర చిత్ర నిర్మాణ సంస్థలలో ఒకటైన హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సినిమాకి టైటిల్ ఇదంటూ అనే రూమర్లు వైరల్ అయిన విషయం తెలిసిందమే. 'ఆరంభం' అనేది ఈ చిత్రానికి టైటిల్ కాబట్టే.. అలా ట్యాగ్ చేశారంటూ.. 'ఆరంభం'ను ట్రెండ్ చేశారు. కానీ మేకర్స్ మాత్రం సైలెంట్‌గా ఎంజాయ్ చేశారు తప్ప.. దానిపై వివరణ ఇవ్వలేదు. ఇప్పుడు టైటిల్ విషయంలో.. ఓ పవర్ ఫుల్ టైటిల్ సోషల్ మాధ్యమాలలో వైరల్ అవుతుంది. అటు త్రివిక్రమ్ సెంటిమెంట్, ఇటు మహేష్ బాబు సెంటిమెంట్ కలగలిసేలా ఉన్న ఈ టైటిల్ ప్రస్తుతం సోషల్ మీడియాని షేక్ చేస్తోంది. 'అయోధ్యలో అర్జునుడు' ఇందులో త్రివిక్రమ్ సెంటిమెంట్ అయినటువంటి మొదటి అక్షరం 'అ', మహేష్ బాబు సెంటిమెంట్ అయినటువంటి చివరి అక్షరం 'డు' ఉండటంతో.. మ్యాగ్జిమమ్ ఇదే టైటిల్ కన్ఫర్మ్ అయ్యే అవకాశం ఉన్నట్లుగా టాక్ నడుస్తుంది. ఇంతకుముందు త్రివిక్రమ్ సినిమాల టైటిల్ విషయంలో ఏం జరిగిందో తెలియంది కాదు. ఒక టైటిల్‌ని వారే సృష్టించి ఫ్యాన్స్‌లోకి వదలడం.. ఆ టైటిల్‌కి వచ్చిన స్పందనని చూసి.. చివరికి దానిని ఫైనల్ చేయడం అనేది తరుచూ జరుగుతూ వస్తుంది. ఇప్పుడు కూడా ఈ టైటిల్ చిత్ర వర్గాల నుండే వచ్చిందని కొందరు అనుకుంటుంటే.. కాదు, సూపర్ స్టార్ ఫ్యాన్స్.. తమ హీరో కోసం సెట్ చేసిన టైటిల్ అని మరికొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఈ కామెంట్స్‌తో ప్రస్తుతం 'అయోధ్యలో అర్జునుడు' అనే టైటిల్ ట్రెండ్ అవుతోంది.



## పుష్ప-2లో కాజల్ ఐటమ్ సాంగ్

### ఎంపిక వార్తలపై బన్నీ అభిమానుల షాక్

అల్లు అర్జున్.. సుకుమార్ కాంబినేషన్ లో వచ్చిన పుష్ప సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. ముఖ్యంగా ఏ మాత్రం ప్రమోషన్ లేకుండా ఉత్తర భారతంలో వంద కోట్లకు పైగా పుష్ప వసూళ్లు రాబట్టుకోవడానికి ప్రధాన కారణం సినిమాలోని సాంగ్స్.. మరీ ముఖ్యంగా ఐటెం సాంగ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుతం పుష్ప 2 ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్న విషయం తెల్సిందే. సౌత్ ఆడియన్స్ తో పాటు నార్త్ ఆడియన్స్ ని కూడా యాక్షన్ తో పాటు అన్ని విధాలుగా ఎంటర్ టైన్ చేసేలా సినిమా ఉండాలని సుకుమార్ కాస్త ఎక్కువ సమయం తీసుకుంటున్నాడు. ముందుగా అనుకున్న ప్రకారం ఈ ఏడాది ఆరంభంలోనే షూటింగ్ ప్రారంభించి ఇదే ఏడాది డిసెంబర్ లో పుష్ప 2 విడుదల చేయాల్సి ఉంది.కానీ పుష్ప భారీ విజయం తర్వాత ప్రతి విషయాన్ని కూడా ఒకటికి రెండు సార్లు ఆలోచించి మరీ నిర్ణయం తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. పుష్ప 2 సినిమాలో ఐటం సాంగ్‌ను చందమామ బ్యూటీ కాజల్ అగర్వాల్ తో చేయించాలని భావిస్తున్నారు.. ఆమెతో ఇప్పటికే చర్చలు జరిగాయని ప్రచారం. ఈ విషయం పై చిత్ర యూనిట్ సభ్యుల నుండి ఎలాంటి స్పష్టత లేదు. కేవలం పుకారుగా మాత్రమే ఈ విషయం తెగ చక్కర్లు కొడుతోంది. అయినా కూడా బన్నీ ఫ్యాన్స్ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం అంటున్నారు. పుష్ప లో సమంతతో ఐటెం సాంగ్ చేయించారు. ఊ అంటావా పాటకు సమంత మాస్.. హాట్ స్టెప్పులు ప్రతి ఒక్కరిని రెచ్చగొట్టాయి అనడంలో సందేహం లేదు. అలాంటిది పుష్ప 2 ఐటం సాంగ్ అంతకు మించి ఉండాలి కదా అంటూ బన్నీ అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చిన కాజల్ తో ఐటం సాంగ్ చేయించే నిర్ణయం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in